క్లుప్తంగా

ఆశ్రమంలో చండీహోమం



పూజలో పాల్గొన్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరంలోని హర్కారాబావి రోడ్డు రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీకృష్ణ సాయి ఆశ్రమంలో చండీహోమం నిర్వహించారు. తొలుత పంచదారతో అభిషేక పూజలు చేయగా.. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆతర్వాత అన్నదానం చేశారు. ఆశ్రమ చైర్మన్ లగడపాటి రామారావు, కార్యదర్శి సిద్ధంశెట్టి నాగమణి, చౌడవరపు మధుసూదన్‌రావు, గ్రందె మోహన్‌రావు, నరహరి రమేష్‌కుమార్, పుల్లఖండం వెంకటరామారావు, తదితరులు పాల్గొన్నారు.

జాస్తిపల్లిలో వైద్య శిబిరం

కామేపల్లి: మండలంలోని జాస్తిపల్లిలో ప్రధాన మంత్రి టీబీ ముక్తిభారత్ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. సుమారుగా 125 మందికి షుగర్, టీబీ, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించడంతో పాటు మరో 15 మందిని ఇతర వైద్య పరీక్షల నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శిరీష తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ శ్రీనివాసరావు, రాధాకృష్ణ, నరేందర్, విజయ కుమారి, రామకృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

రోశయ్య జయంతి వేడుకలు

నేలకొండపల్లి: మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను శుక్రవారం పట్టణ ఆర్య వైశ్య సంఘం, వాసవీ కన్యాకపరమేశ్వరీ కల్యాణ మండపం, వాసవీ క్లబ్స్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, రేగూరి వాసవి, హనుమంతరావు, మాటూరి సుబ్రహ్మణ్యం, యర్రా నాగేశ్వరరావు, తెల్లాకుల అశోక్, జయశ్రీ, వంగవీటి నాగేశ్వరరావు, జగన్‌మోహన్‌రావు, ఉషారాణి, నవ్య, తదితరులు పాల్గొన్నారు.

'త్రివేణి'లో వన మహోత్సవం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని త్రివేణి పాఠశాలలో శుక్రవారం వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించినట్లు విద్యాసంస్థల అధిపతి డాక్టర్ గొల్లపుడి వీరేంద్రచౌదరి తెలిపారు. దీనిలో భాగంగా గత వారం రోజులుగా విద్యార్థులు తమ పరిసర ప్రాంతాలు, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి–త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్‌లతో పాటు మురళీకృష్ణ, స్వపన్న, ముస్తఫా, సందీప్ పాల్గొన్నారు.

ఇక మధ్యాహ్న తనిఖీలు..



కట్టుకాచారాంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

- నాణ్యతలో రాజీ లేకుండా విద్యార్థులకు రోజూ కోడిగుడ్డు
- మెనూ ప్రకారం వడ్డించేలా చర్యలు
- తనిఖీలు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పక్కాగా అమలయ్యేలా విద్యాశాఖ ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం ఏజెన్సీ నిర్వాహకులకు, హెచ్‌ఎంలకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. పరిసరాల పరిశుభ్రత, వంటలపై రాష్ట్ర స్థాయి నిపుణులతో అవగాహన కల్పించారు. దీంతో ప్రస్తుతం మండల విద్యాశాఖాధికారులు మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు.

మెనూ అమలు పక్కా..

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మెనూ కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా రోజు కోడిగుడ్డు వడ్డించనున్నారు. నాణ్యతపై ఆయా కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, మండల విద్యాధికారులు తనిఖీ చేసి ఫొటోలు తీసి విద్యాశాఖకు పంపించాల్సి ఉంటుంది. నాణ్యత లోపం ఉంటే నోటీసులు జారీ చేస్తారు. మండల స్థాయిలోనే కాకుండా, జిల్లా స్థాయిలో డీఈఓతో పాటు రాష్ట్ర స్థాయి బృందాలు కూడా తనిఖీలు చేసేలా కార్యాచరణ రూపొందించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రతీ రోజు ఉపాధ్యాయుల పర్యవేక్షణలో వంటలు తయారు చేయబడుతున్నాయి.

బిల్లుల జాప్యంతో..

మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహించడం బాగానే ఉన్నా ఏజెన్సీలకు బిల్లుల చెల్లింపుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని నిర్వాహకులు మండిపడుతున్నారు. ప్రతీ నెలా సకాలంలో బిల్లులు అందిస్తే తమకు ఇబ్బందులు ఉండవని వాపోతున్నారు. అందినకాడికల్లా అప్పులు తెచ్చి విద్యార్థులకు భోజనం తయారుచేస్తుంటే పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ప్రభుత్వం చెల్లించకపోవడంతో అప్పులపాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా బిల్లులు అందించాలని, పెరిగిన ధరలను బట్టి ఏజెన్సీలకు ధరలు పెంచాలని నిర్వాహకులు కోరుతున్నారు.

మెనూ పాటించకుంటే చర్యలు

ప్రభుత్వ పాఠశాల్లో మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించకుంటే చర్యలు తప్పవని విద్యాశాఖాధికారి బి.చలపతిరావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలో పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకుని మెనూ అమలుచేయకపోతే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం ఏజెన్సీలు, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి భోజన నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఆయా సీఆర్‌పీలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఏజెన్సీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయుడు

తనిఖీలు చేస్తున్నాం..



ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు తనిఖీ చేయాలని ఆదేశాలు అందాయి. ఈమేరకు తనిఖీలు చేస్తూ..ఆయా పాఠశాల విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుంటున్నాం. సేకరించిన నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తున్నాం.

– బి.చలపతిరావు, ఎంఈఓ

పకడ్బందీగా నిర్వహించాలి..



ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం కోసం ప్రత్యేక తనిఖీలు ఏర్పాటు చేయడం సంతోషం. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా బృందాలు పకడ్బందీగా నిర్వహించాలి. ఏజెన్సీలకు ప్రతి నెలా బిల్లులు చెల్లించాలి. అప్పుడే పథకం లక్ష్యం నెరవేరుతుంది.

– జి.మస్తాన్, విద్యార్థి సంఘం నేత

ఏజెన్సీల బాధలు పట్టించుకోవాలి..



మధ్యాహ్న భోజనం వర్కర్ల బాధలను కూడా పట్టించుకోవాలి. ఉపాధ్యాయులంతా విద్యార్థులతో కలిసి ప్రతీ రోజు భోజనాలు చేయాలి. అప్పుడే భోజన నాణ్యత తెలుస్తుంది. అలాగే పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచాల్సిన అవసరం ఉంది.

– తోళ్ల సురేష్, దళిత సంఘం నేత

సారొస్తున్నారని..

రాజీవ్ గృహకల్పలో చెత్త తొలగింపు



కాలనీలో చెత్త తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించడానికి శుక్రవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వస్తున్నారని తెలిసిన మున్సిపల్ శాఖ అధికారులు సిబ్బందితో హడావుడిగా వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. గత నెల ల తరబడిగా చెత్తాచెదారాన్ని సైడ్ కాల్వల్లో నిల్వ మురుగునీటిని తొలగించకుండా ఇప్పుడు కలెక్టర్ సారొస్తున్నారని చెత్త తీసే పనిలో పడ్డారు. ఈవిషయమై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని వారు ఇలా వీధులను శుభ్రం చేయించే పనిలో పడ్డారు. దీన్ని చూసిన కాలనీవాసులు వారానికోసారైనా చేస్తే బావుండునని గుసగుసలాడుకున్నారు.

నగదు స్వాహా..

రఘునాథపాలెం: సెల్‌ఫోన్‌కు వచ్చిన లింక్ ఓపెన్ చేయడంతో ఇద్దరు వ్యక్తుల ఖాతాల్లో నుంచి సైబర్ నేరగాళ్లు నగదు స్వాహా చేశారు. మండలంలోని ఈర్లపుడికి చెందిన శ్రీనివాసరావుకు ఆధార్ కేవైసీ పేరిట వచ్చిన లింక్‌ను ఓపెన్ చేయడంతో సంక్రాంతి రివార్డు పేరిట మరో మెసేజ్ వచ్చింది. అది కూడా చూడగానే ఆయన ఖాతాలోని రూ.57 వేలు డ్రా అయ్యాయి. అలాగే, రఘునాథపాలెంకు చెందిన శంకర్ సైతం తన ఫోన్‌కు వచ్చిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోగానే రూ.76 వేలు డ్రా అయినట్లు గుర్తించాడు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

గంజాయి సేవించిన ఇద్దరి అరెస్ట్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం టేకులపల్లి సమీపంలోని కేసీఆర్ టవర్స్ వద్ద పట్టణ ప్రకృతి వనంలో గంజాయి సేవిస్తున్న ఇద్దరిని శుక్రవారం ఖమ్మం అర్బన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిపై కేసు నమోదు చేయగా, గంజాయి ఎక్కడ కొనుగోలు చేశారనే అంశంపై విచారణ చేస్తున్నామన్నారు.

పోక్సో కేసులో నిందితుల రిమాండ్

కామేపల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలికను మాయమాటలు చెప్పి లోబర్చుకున్న పదిహేడేళ్ల బాలుడితో పాటు అతడికి సహకరించిన స్నేహితుడుపై ఈ నెల 2న పోక్సో కేసు నమోదైంది. ఈమేరకు శుక్రవారం నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో గాయాలు

నేలకొండపల్లి: మండల కేంద్రంలో రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన వ్యాపారి అయ్యప్ప బైక్‌పై తన కుమారుడితో కలిసి శుక్రవారం కొత్త కొత్తూరు వెళ్తున్నారు. కొత్తకొత్తూరు నుంచి నేలకొండపల్లికి వెంకటేష్ బైక్‌పై వస్తుండగా పాత బస్టాండ్ వద్ద ఢీకొన్నాయి. ఈ ఘటనలో అయ్యప్పకు గాయాలు కాగా ఖమ్మం తరలించారు.

రఘునాథపాలెంలో..

రఘునాథపాలెం: మండలంలోని రఘునాథపాలెం బైపాస్‌లో ద్విచక్రవాహనాన్ని వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో డి.రాకేష్‌కు గాయాలయ్యాయి. ఈనెల 1న రాకేష్ తన బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. ఈమేరకు శుక్రవారం ఆయన తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

సమ్మె పోస్టర్లు ఆవిష్కరణ

నేలకొండపల్లి: కార్మిక హక్కుల సాధన కోసం ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం టీయూసీఐ జిల్లా కార్యదర్శి జి.రామయ్య ఆవిష్కరించారు. మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి రామదాసు, వెంకన్న, సైదులు, హీరాలాల్, సుజాత, వీరకుమారి, ఆనంద్, వెంకటలక్ష్మి, రంగమ్మ, సాయి, రఘు, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంవ్యవసాయం/కూసుమంచి: ఖమ్మం నగరంలోని 11 కేవీ బస్టాండ్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–2 ఏఏఈ బి.రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో బస్ డిపో రోడ్డు, భక్త రామదాసు కళాక్షేత్రం, పెవిలియన్ గ్రౌండ్, మయూరిసెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పెరికసింగారం, గట్టుసింగారం, జక్కేపల్లి, రాజుపేట, గోరీలపాడు, చాంప్లాతండా, భగవాన్ తండా, తుమ్మల తండా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఏఈ తావుర్యా తెలిపారు. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

సర్దుబాటు సవరించే వరకూ ఉద్యమం



గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నేలకొండపల్లి: ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను సవరించే వరకూ ఉద్యమం ఆగదని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని వివిధ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని, జనాభాకు అనుగుణంగా నూతన పాఠశాలలను ఏర్పాటు చేయాలని, ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, సీపీఎస్ యూపీఎస్ విధానాన్ని, నూతన జాతీయ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలల సమయాన్ని 9 గంటల నుంచి 4.30 గంటల వరకు మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కట్టా పద్మ, అరవింద్, జ్యోతి, వెంటరమణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, తొర్తి గురవయ్య, నవాబ్‌సాహెబ్, కోటేశ్వరరావు, శ్రీను, స్వామి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

వాకీటాకీలు అందజేత



వాకీటాకీ అందిస్తున్న కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో కేఎంసీ ఆధ్వర్యాన 60 డివిజన్లకు చెందిన శానిటరీ జవాన్లకు కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ వాకీటాకీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాకీటాకీలతో ప్రతీ జవాన్ నుంచి తక్షణ సమాచారం సేకరించడానికి, వారు ఎక్కడ ఏ ప్రాంతంలో, ఏ సమయానికి పనిచేస్తున్నారనేది తెలుస్తుందన్నారు. ఇది శానిటేషన్ పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు దోహదపడుతుందని తెలిపారు.

పాత బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతి ఇవ్వాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని వెంటనే ఖమ్మం మున్నేరు పాత బ్రిడ్జిపై కార్లు, ఆటోలు, బైక్‌లు, తిరగడానికి అనుమతి ఇవ్వాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారి ఎ.పద్మశ్రీకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తీగల వంతెన నేపథ్యాన గత మూడు రోజులుగా కాల్వొడ్డు పాత బ్రిడ్జిని మూసివేయడంతో బైపాస్ రోడ్డు మీద ట్రాఫిక్ పెరిగి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. తీగల వంతెన పనులను త్వరగా పూర్తిచేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని ఆయన కోరారు. వినతి అందించిన వారిలో నాయకులు దొంగల తిరుపతిరావు, బోడుబట్ల సుదర్శన్, జీడిగుంట్ల వెంకన్న బాబు, ఇమామ్, అమరావతి, సీహెచ్.భద్రం, ఏఎం రెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు గర్హనీయం

రఘునాథపాలెం: ఉద్యోగాల నోటిఫికేషన్లు, నిరుద్యోగ భృతి, రాజీవ్ యువ వికాసం పథకాల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యాన చలో సచివాలయం కార్యక్రమాన్ని చేపడితే అక్రమ అరెస్టులు చేయడం గర్హనీయమని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతల రమేష్ అన్నారు. శాంతియుతంగా ఉద్యమానికి పిలుపునిచ్చిన నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ హామీని అమలు చేయకపోతే నిరుద్యోగ యువతతో కలసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని, అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు షేక్ షరీఫ్, నాయకులు పాల్గొన్నారు.

నియామకం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని రెండు దేవాలయాలకు ప్రభుత్వం పాలకవర్గాలను నియమించింది. ఈక్రమంలో స్థానిక రాజగోపాలస్వామి దేవాలయం చైర్మన్‌గా మన్నె వెంకటరవి, సభ్యులుగా కాసాని మణెమ్మ, చట్టు శ్రీనివాసరావు, గుండెపాంగు శ్రీను, కైలాసపు గోపి, మేకపోతుల సురేష్, పగిడికత్తుల సాలయ్య నియమితులయ్యారు. అలాగే శ్రీ ఉత్తరేశ్వరస్వామి దేవాలయం చైర్మన్‌గా మారుతి చంద్రమౌళి, సభ్యులుగా సామాల కోటేశ్వరరావు, చిట్టెంశెట్టి వెంకటేశ్వరరావు, లింగం శ్రీను, పగిడికత్తుల సుజాత, కొమ్మనబోయిన సీతారాములు, రాజపుత్ర సీతారాంసింగ్‌లు నియమించబడగా.. నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

బహిరంగ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



ఖమ్మంఅర్బన్: మంత్రి తుమ్మల క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరుతున్న నేతలు

హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జై బాపు–జై భీమ్– జై సంవిధాన్ బహిరంగసభకు శుక్రవారం వివిధ మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రత్యేక వాహనాల్లో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. బయలుదేరిన వాహనాలను పార్టీ నేతలు జెండా ఊపి ప్రారంభించగా.. వచ్చేస్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్

ఆంగ్ల బోధనలో నైపుణ్యం పెంచుకోవాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ దీక్షారైనా

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఆంగ్ల భాషా బోధనలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని జెడ్పీ సీఈఓ దీక్షారైనా సూచించారు. ఖమ్మంలోని శాంతినగర్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన 'వికెన్ లెర్న్'కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు సిద్ధం కావాలని, రెగ్యులర్ సిలబస్‌తో పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. డీఈఓ సామినేని సత్యనారాయణ, ఏఎంఓ యలగందుల రాజశేఖర్‌తో పాటు నిక్షిత్, యాని, జగదీశ్, భాస్కర్, రామనాథ్ పాల్గొన్నారు.

నానో ఎరువులపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ పుల్లయ్య

రఘునాథపాలెం: జిల్లాలో నానో యూరియా, నానో డీఏపీ ఎరువులపై వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కోరమండల్ ఇంటర్నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ ఆధ్వర్యాన నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రైతులు సాగు చేస్తున్న వివిధ పంటలపై నానో యూరియా, నానో డీఏపీ వాడకాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని, ఫలితంగా పంటల దిగుబడులు పెరగడమే కాక ఖర్చులూ తగ్గుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఐదు డివిజన్ల వ్యవసాయ సహాయ సంచాలకులు, అన్ని మండలాల మండల వ్యవసాయాధికారులు, సాంకేతిక వ్యవసాయ అధికారులు, విస్తరణాధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోరమండల్ సంస్థ అగ్రనమిస్టు డాక్టర్ టి.సుధాకర్‌రెడ్డి, జోనల్ ఆఫీసర్ సుమన్‌రెడ్డి, బిజినెస్ హెడ్ స్వరూప్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే..



నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పేద ప్రజల పక్షాన పోరాడిదని కమ్యూనిస్టులేనని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. మండలంలోని కొక్కిరేణి గ్రామంలో స్వర్గీయ కామ్రేడ్ చావా వెంకటేశ్వరరావు 11వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించాక మాట్లాడారు. మండలంలో పార్టీ ఎదుగుదలకు ఎంతో కృషి చేశారని, ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండి సురేష్, రాష్ట్ర రైతు సంఘం నాయకుడు మహమ్మద్ మౌలానా, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు డీసీసీబీ డైరెక్టర్ సొసైటీ చైర్మన్ చావా వేణుగోపాలకృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి రాధాకృష్ణ, సహాయ కార్యదర్శి చీమ రామకృష్ణ, మండల నాయకులు చావా వెంకట్రావు, మల్లేపల్లి జనార్దన్, మధు, బీఆర్‌ఎస్ నాయకులు గడ్డం వీరభద్రం, గంట కృష్ణ పాల్గొన్నారు.

లాయర్లకు యూనిఫాం క్లాత్ కిట్ల పంపిణీ

ఖమ్మంమయూరిసెంటర్: బార్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి సిద్ధం చేసిన యూనిఫామ్ క్లాత్ కిట్లను లాయర్లకు అందజేశారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొప్పుల చంద్రశేఖర్, సీనియర్ న్యాయవాది, ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు స్వామి రమేష్‌కుమార్‌తో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లాయర్లకు శుక్రవారం నగరంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో అందించారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ బాధ్యులు లక్కినేని సత్యనారాయణ, కోనా చంద్రశేఖర్‌గుప్తా, ఖమ్మం బాధ్యులు రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూటీ పనులు త్వరగా పూర్తి చేయాలి

కూసుమంచి: పాలేరు వద్ద సాగర్ ఎడమకాల్వకు నిర్మిస్తున్న అండర్ టన్నెల్ (యూటీ) నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం యూటీ నిర్మాణ పనులను ఆయన పార్టీ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నున్నా రవికుమార్ తదితరులతో కలిసి పరిశీలించి పని వివరాలను సంబంధిత అధికారుల అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెండర్ ప్రక్రియ లేకుండా యూటీ పనులను ఎలా చేపట్టారని ప్రశ్నించారు. గతేడాది మాదిరిగా కొట్టుకుపోకుండా నాణ్యత పాటించాలన్నారు. యూటీ పనుల వివరాలు, ఖర్చులను బహిర్గతం చేయాలని, నిధుల వినియోగంపై ఆడిట్ చేయించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఈవీ రమేష్, సుబ్బారావు, రవి రాథోడ్, సుదర్శన్, హట్యా నాయక్, వెంకటేశ్వర్లు, పుణ్యవతి, సుధాకర్, మల్లారెడ్డి, మురళి, ఉపేందర్ రెడ్డి, వెంకన్న, వెంకటరెడ్డి, శేఖర్ రజనిరెడ్డి, మహేందర్, వీరన్న, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలకు గుర్తింపు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం రోటరీ క్లబ్ సేవలకు గుర్తింపు లభించింది. ఇటీవల హైదరాబాద్‌లో జిల్లాల స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన సభ్యులకు అవార్డులు అందించారు. ఈ అవార్డుల్లో 2024–25 రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం ప్రెసిడెంట్ ఎస్.రవీంద్రనాథ్, గవర్నర్ డి.సాంబశివరావు, భూషణ్‌రావు తదితరులు ఉన్నారు.

దొడ్డి కొమరయ్య వర్ధంతి..




ఖమ్మం మామిళ్లగూడెం: నివాళులర్పిస్తున్న కురుమ సంఘం నేతలు

తెలంగాణ రాష్ట్ర సాధనకు, బడుగు బలహీన వర్గాల వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన దొడ్డి కొమరయ్య వర్ధంతి వేడుకలను శుక్రవారం రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కొమరయ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. – సాక్షినెట్‌వర్క్

ఇంకా అద్దె భవనాల్లోనే..

- అసంపూర్తిగా చిమ్మపుడి అంగన్‌వాడీ భవనం
- ఎనిమిదేళ్ల క్రితం శ్లాబు
- నేటికీ పూర్తికాని వైనం
- అద్దె భవనంలో నెట్టుకొస్తున్న అధికారులు



చిమ్మపుడిలో అసంపూర్తిగా మిగిలిన అంగన్‌వాడీ భవనం

రఘునాథపాలెం: విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులతో కూడిన విద్యను అందించమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్తున్న పాలకులు క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా ఉంది. ఇందుకు నిదర్శనం గత ఎనిమిదేళ్ల క్రితం మండలంలోని చిమ్మపుడి గ్రామంలోని అంగన్‌వాడీభవనాన్ని చూస్తే అర్థమవుతుంది. గ్రామంలో చిన్నారులు, గర్భిణులకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు పౌష్టికాహారం అందించడం, ఆరోగ్య పరిరక్షణ కోసం అంటూ 4 అంగన్ వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసి కొనసాగిస్తున్నారు. ఇందులో ఒకదానికి మినహా మిగిలిన మూడు మూడు కేంద్రాలకు భవన సదుపాయం లేక అద్దె భవనంలో అవస్థల మధ్య నెట్టుకొస్తున్నారు.

తొలి విడతగా రూ.4.5లక్షలు..

పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభించిన చిమ్మపుడి భవన ప్రారంభంలో తొలి విడతగా రూ.4.5 లక్షలతో గోడలు నిర్మాణం చేసి శ్లాబు వేసి వదిలేశారు. నాటి నుంచి నేటి వరకు భవనం పూర్తి చేయకుండా వదిలేశారు. దీంతో విద్యార్థులు కూర్చోవాల్సిన భవనంలో కుక్కలు, కోళ్లు, పశువులకు నివాసాలుగా మారాయి. కాలనీలో అంగన్‌వాడీ భవనానికి స్థలం లేదు, భవనం లేదు. అక్కడ అద్దె భవనంలోనే కొనసాగుతుంది. మరో కేంద్రం ప్రభుత్వ పాఠశాలలో భవ నం నిర్మాణం చేసినా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించలేదు. ఉన్న దాంట్లోనే విద్యార్థులను కూర్చోబెడుతూ కాలం వెల్లదీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు అసంపూర్తిగా నిలిచిన రెండు కేంద్రాల భవనాలు పూర్తి చేసి, కాలనీలో స్థలం కేటాయించి భవనం నిర్మించాలని వేడుకుంటున్నారు.